


# పరదేశీ కథలు

## - చిట్టే సిద్ధ లలిత



- 97-

## ఎడారి సీమలో నూర్జహాన్

ఒక్కసారిగా నిలువెత్తు ఎడారి దుమ్ము చుట్టూ నిండుకునేసరికి ఉక్కిరిబిక్కిరి అయింది నూర్జహాన్. మట్టి ఊపిరి తిత్తుల్లోకి వెళ్ళడంతో తెరలు తెరలుగా దగ్గు కమ్ముకుంది. ఎడారిలో ఇసుక తుఫాను ఎప్పుడొచ్చి పడుతుందో తెలియదు, ఏ వైపునుండి వస్తుందో తెలియదు. దుమ్ముతో పాటూ హోరున గాలి వీచడంతో నడక తడబడింది.

తలకు చుట్టుకున్న గుడ్డ ముడి విడివడి రివ్వున గాల్లోకి ఎగిరింది. చేతులు పైకి సాచి తలగుడ్డను అందుకోవడానికి ముందుకు పరిగెత్తింది నూర్జహాన్. కాలికి రాయి అడ్డుపడటంతో, కళ్ళలోకి దుమ్ము పోవడంతో బోర్లా పడిపోయింది. దెబ్బ బలంగా తగిలిందేమో ఎవరో వచ్చి చేయి పట్టి లేవనెత్తేవరకు పైకి లేవలేకపోయింది. కళ్ళు తెరవలేక పోయింది.

"షాల్ కోసం పరిగెడుతూ ఇలా నడిరోడ్డుపై పడిపోతే ఎలా అమ్మాయీ. ఇక్కడ కార్లు రయ్యిన దూసుకువస్తుంటాయి. ఈ ఇసుక తుఫాను దెబ్బకు పదడుగుల దూరంలో ఏముందో కూడా కంటికి కనిపించడం లేదు. ప్రమాదం కదా.." సున్నితంగా మందలిస్తూ పేవ్ మెంటు మీద కూర్చోబెట్టి నీళ్ళ బాటిల్ తో ముఖాన్ని కడిగాడు ఆ యువకుడు.

కాస్త తెప్పరిల్లాక తాగమని నీళ్ళ బాటిల్ చేతికి అందించాడు. కాసిన్ని నీళ్ళు తాగి ఊపిరి పీల్చుకుంది నూర్జహాన్. ఎవరా అని అతని ముఖంలోకి తేరిపార చూసింది. అతన్ని అంతకుముందెపుడూ, ఎక్కడా చూసినట్లు లేదు. నవ్వుతూ గులాబి రంగులో వున్న తలగుడ్డను ఆమెకు అందించాడతను. అప్పటికి గుర్తొచ్చింది తన తలపైన హిజాబ్ లేదని. కంగారుపడుతూ తీసుకుని తలకు చుట్టుకుంది. ఆమె హ్యాండ్ బ్యాగులోని వస్తువులన్నీ చుట్టూ చెల్లా చెదురుగా పడివున్నాయి. అన్నీ ఏరుకొచ్చి బ్యాగులో వేసి అందిస్తూ..

"ఇందులో అన్నీ వున్నాయా ఒకసారి చూసుకోండి" అన్నాడు.

పరీక్షగా చూసి వున్నాయి అన్నట్లుగా తల వూగించింది నూర్జహాన్.

"సరే ఇల్లెక్కడో చెపితే తీసుకెళ్ళి దింపుతాను" అన్నాడు ఆ పక్కన పార్కు చేసిన కారు వేపు నడుస్తూ. అలాగే అంటూ లేచి అతన్ని అనుసరించపోయింది. కానీ కాలు కలుక్కుమని నొప్పి పెట్టడంతో అమ్మా అంటూ కాలు పట్టుకుని నిస్సహాయంగా నిలబడింది.

కారెక్కబోయేవాడు ఆమె కోసం తిరిగి చూసి బాధతో అల్లాడుతున్న నూర్జహాన్ దగ్గరికి పరుగున వచ్చి' అనుకున్నా.. దెబ్బ బాగానే తగిలిందని. ఏదీ చూడనీ' అంటూ కిందకి కాలు వైపు చూసాడు.

అతనికి తన మోకాలు చూపించాలంటే సిగ్గు పడిందామె.

"నా చెయ్యి పట్టుకుని చిన్నగా నడువు" అంటూ చేయి సాచాడు అతడు. ఇక తప్పదు అన్నట్లు చేయి అందుకుంది నూర్జహాన్.

కారు దయా హాస్పిటల్ వైపు దూసుకుపోయింది. డాక్టర్ కు చూపించి కట్టు కట్టించి మెడిసన్స్ ఇప్పించిన దాకా ఇద్దరూ ఏమీ మాట్లాడుకోలేదు. మౌనంగా వుండిపోయారు.

తిరిగి కారెక్కాక..

"అమ్మాయీ మీ ఇల్లెక్కడో చెపితే దిగబెడతాను" అన్నాడతడు నవ్వుతూ.

అప్పుడు అతనివైపు తేరిపార చూసిందామె. ఏ దేశంవాడో కానీ తెల్లగా, సన్నగా, అందంగా వున్నాడు. నవ్వుతుంటే బుగ్గపై పడే సొట్ట ఆకర్షిస్తోంది. అతన్నే చూస్తూ అడ్రస్ చెప్పిందామె.

"అమ్మాయి పేరు ఏంటో తెలుసుకోవచ్చా.." కళ్ళలోకి చూసాడు.

'నూర్జహాన్' చెప్పింది.

"మీది ఇండియానే కదా" తెలుసన్నట్లుగా అడిగాడు.

"అవును ఎలా తెలుసు" అడిగింది ఆశ్చర్యంగా.

"అందమైన అమ్మాయిలు ఇండియా నుండే వస్తారు మరి" నవ్వాడు.

"నూర్జహాన్ అంటే విశ్వానికి వెలుగైనది అని అర్థం కదూ" అన్నాడు సాలోచనగా చూస్తూ..

"అవును" అంది చిరునవ్వుతో..

"గుడ్.. మీ ఇల్లొచ్చింది. పదండి లోపలికి తీసుకెళతాను అంటూ ఇది నా విజిటింగ్ కార్డ్. కాలు నొప్పి ఎలా వుందో సాయంత్రం కాల్ చేసి చెప్పండి. ఎదురు చూస్తుంటాను" అన్నాడు.

"థాంక్యూ.. ఇంతకీ మీ పేరు చెప్పనే లేదు" అంది సంశయంగా.

"నా పేరు అక్బర్" అన్నాడు చిలిపిగా నవ్వుతూ.

‘ మీ ఎదురింట్లో మా ఫ్రెండ్స్ వుంటున్నారు. నేను అపుడపుడూ వాళ్ళింటికి వచ్చి వెళుతుంటాను. దాదాపూ రెండేళ్ళుగా మిమ్మల్ని గమనిస్తున్నాను. మీ భర్త మిమ్మల్ని బాగా కొడుతుంటాడు కదూ..
నేను చూడలేదు కానీ మా ఫ్రెండ్స్ చెప్పారు’ జాలిగా ఆమెకేసి చూస్తూ చెప్పాడు.
ఉలిక్కిపడింది నూర్జహాన్.
‘అంతేకాదు అతను అన్ని దేశాల అమ్మాయిలతో తిరుగుతాడు,వాళ్ళను ఇంటికి కూడా తీసుకొస్తాడట కదా.
ఇంతకాలం అతన్ని ఎలా భరిస్తున్నారు. పోలీసులకు చెప్పకుండా అతడి ఆగడాలను ఎలా సహిస్తున్నారు.
ఈ కువైట్ దేశంలో భార్యను అలా హింసించడం చాలా తప్పు తెలుసా?’ ఈసారి లాలనగా అడిగాడు.
అతని మాటల్లోని ఆప్యాయతకు ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగాయి. జవాబు చెప్పలేక మౌనంగా నిలబడి పోయింది అక్బర్ వెళ్తున్నంతసేపూ వెనకనుండి చూస్తుండిపోయింది.

బ్రెడ్ తిని పాలు తాగి డాక్టర్ ఇచ్చిన టాబ్లెట్స్ వేసుకుంది నూర్జహాన్. నిద్ర పట్టేసింది. నిద్రలో ఏవో పిచ్చి కలలు. ఎవరో వచ్చి చేయి పట్టి ఉద్యానవనంలోకి నడిపిస్తున్నారు. పువ్వులతో తలను అభిషేకిస్తున్నారు. చాలా సంతోషంగా అనిపించింది. అతన్ని గట్టిగా హత్తుకుందామనుకునే లోపల కల చెదిరింది. ఎదురుగా క్రూరంగా చూస్తూ నిలబడిన భర్త కనబడ్డాడు. భయపడింది.
"ఎవడే వాడు. ఇంటిదాకా తీసుకొచ్చావా. అంత ధైర్యమొచ్చిందా. నేను చేతకానివాడిననుకున్నావా" ఆమె చెంపలపై వాయించాడు.
నివ్వెరపోయింది నూర్జహాన్. ఏదో చెప్పబోయింది.
"వెంటనే నీ బ్యాగు సర్దుకోవే. నిన్ను కువైట్ నుండి పంపించేస్తాను."
ఎంతగా ప్రాథేయపడి చెపుతున్నా ఏదీ వినిపించుకోలేదతడు. ఇంకా బలంగా కొట్టసాగాడు. ముఖమంతా కమిలిపోయింది. కొట్టి కొట్టి విసుగొచ్చాక బయటికి వెళ్ళిపోయాడు.
నిదుర కరిగింది. అందమైన కల చెదిరిపోయింది. ఐదేళ్ళనుండీ భరిస్తోంది భర్త అనబడే ఈ పశువును. ఆడదాన్ని కొట్టడం అతనికి ఇష్టం. ఎంతకాలం భరించగలదు. పెళ్ళి చేసుకుని కువైట్ కు వచ్చిందే గానీ భర్తతో సుఖమంటూ ఏమీ లేదు. అప్పటికే అతనికి కువైట్ లో ప్రియురాలు వుంది.
పేరుకు పెళ్ళి చేసుకున్నాడు. నూర్జహాన్ కు నరకాన్ని చూపిస్తున్నాడు. మగాడిలో శాడిజం శృతి మించిపోతే స్త్రీకి భూమ్మీద నరకమే.
ఆమెకు ఆ క్షణంలో అక్బర్ గుర్తొచ్చాడు. అతని మాట పద్ధతి, ప్రవర్తన ఎంత బావున్నాయి.. అతనితో వున్న

కాసేపూ ఆహ్లాదంగా గడిచింది. నిట్టూర్చిందామె. ముఖంపై దెబ్బలు నొప్పి పెడుతుంటే దు:ఖం ముంచుకొచ్చింది. ఈ పరాయి దేశంలో వుండటం కంటే ఇండియాకు అమ్మానాన్నల దగ్గరికి వెళ్ళడమే నయం కదా అనిపించింది.

అక్బర్ కు కాల్ చేద్దామని ఫోన్ చేతిలోకి తీసుకుంది కానీ ఎందుకో సంశయం. తను పెళ్ళయిన స్త్రీ. భర్త దుర్మార్గుడు. ఇంటి దాకా తోడుగా వచ్చినందుకే ఇన్ని మాటలు అని ఇన్ని దెబ్బలు కొట్టాడు. ఇక ఫోన్ చేసి మాట్లాడితే ఏమవుతుందో.

అక్బర్ ను ఇబ్బందుల్లోకి నెట్టడం మంచిది కాదు. ఆ ఆలోచనతో ఆగిపోయింది నూర్.

రెండ్రోజులు గడిచాయి.

ముఖం మీద దెబ్బలు మానుతున్నాయి. కాలు నొప్పి కూడా కాస్త తగ్గింది.

అక్బర్ ను మనసులోపల దాచేసి బలవంతంగా మరిచిపోయేందుకు సిద్ధమయింది నూర్జహాన్.

ఇంతలో కాలింగ్ బెల్ మోగింది. ఎవరా అనుకుంటూ తలుపు తీసింది.

బయట చిరునవ్వుతో నిలబడ్డ అక్బర్ ను చూసి గుండె వణికింది.

ఆత్మీయుడిని కలిసినట్లు కన్నీళ్ళు బుగ్గలపైకి జారాయి.

"అరె ఏమయింది.. ముఖంపై ఆ దెబ్బలేమిటి.." లోనికి అడుగు వేసి చనువుగా కన్నీళ్ళను తుడిచాడు.

ఆ క్షణం అతన్ని అల్లుకుపోవాలనిపించింది. కానీ ప్రయత్నం మీద తమాయించుకుంది.

అతనికి దూరంగా జరిగి "వద్దు ప్లీజ్ నువ్వు ఇక్కడ్నుంచి వెళ్ళిపో" అంది.

"ఏయ్ భయపడకు. పోతాలే. నీ కాలు ఎలావుందో చూడాలని వచ్చాను" అన్నాడు.

"చూసావుగా ఇక వెళ్ళు" అంది భయంగా బయటికి చూస్తూ.

"వెళతాను కానీ ముందు ముఖమెందుకు అలా వుందో చెప్పు" అడిగాడు.

"అదంతే నా ఖర్మ. నువ్వు వెళ్ళు" కోపంగా చెప్పింది.

"నీకు నాతో మాట్లాడాలని లేదా" రెట్టించాడు అక్బర్.

"ఎందుకు లేదు.. వుంది. కానీ అతడొచ్చే టైమయింది. మనల్ని ఇక్కడ చూస్తే ప్రమాదం." వణికిపోయింది.

“ఐ డోంట్ కేర్. నిన్ను వేధిస్తున్నందుకు వాడిని మక్కెలు విరగతన్ని పోలీసులకు అప్పగిస్తా అన్నాడు అక్బర్.

ఇంతలో బయట్నుంచి సుడిగాలిలా వచ్చేసి మీద పడ్డాడు అతడు. పిడికిళ్ళు బిగించి ఆవేశంగా అక్బర్ దవడ మీద గుద్దసాగాడు.

తేరుకునే లోపల కళ్ళముందు నక్షత్రాలు చూపించాడు. అక్బర్ కూడా తొందరగానే తెప్పరిల్లి ప్రతిఘటించాడు.

ఇద్దరూ హోరాహోరీ తలపడ్డారు. ఇంట్లో సామాన్లు చెల్లాచెదురు అయ్యాయి.

"నా పెళ్ళాం కోసం ఇంటికే వస్తావురా బా...ర్డ్" అంటూ తిట్లు లంకించుకున్నాడు వాడు.

"ప్లీజ్ వెళ్ళిపో అక్బర్ నువు ఇక్కడ్నుంచి వెళ్ళిపో" అంటూ అక్బర్ ను బయటికి తోసింది నూర్జహాన్.

"నువు జాగ్రత్త. వీడు నిన్ను కొడితే నాకు చెప్పు. వచ్చి వీడి తాట తీస్తా" అంటూ వెళ్ళిపోయాడు అక్బర్.

అనవసరంగా గొడవ అయింది. తన మూలంగా అక్బర్ దెబ్బలు తిన్నాడు అనుకుంటూ ఏడ్చింది నూర్జహాన్.

ఆ రోజంతా నూర్జహాన్ ను తిడుతూనే వున్నాడు భర్త.

కన్ను సలుపుతుంటే ముఖాన్ని అద్దంలో చూసుకుంది నూర్.

కంటి చుట్టూ నల్లగా కమిలిపోయింది. భర్త పెట్టే బాధలు అతడు కొట్టే దెబ్బలు ఇక భరించలేననిపించింది నూర్ కు. తనను పెళ్ళి చేసుకున్నంత మాత్రాన తిట్టి కొట్టే హక్కు, అధికారం అతడికి లేవు.

అందులో అతడు శ్రీలంక అమ్మాయితో పబ్లిక్ గా తిరుగుతున్నాడు.  మూడ్నెల్ల క్రితం ఇంకో ఫిలిప్పీన్ అమ్మాయి కూడా సరాసరి ఇంటికే వచ్చేసి తన కళ్ళముందే అతడితో బెడ్ రూం లోకి వెళ్ళింది. ఇలాంటివన్నీ ఎలా సహించడం. ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలి. ఇంటికి వెళ్ళిపోతే బావుంటుంది అనుకుని బ్యాగులో బట్టలు సర్దుకోసాగింది.

కాలింగ్ బెల్ మోతకు ఉలిక్కిపడింది. అతడు ఇంతకుముందే వెళ్ళాడు. ఇప్పుడెవరు వచ్చారు. కీ హోల్ లో నుండి చూడాలని ప్రయత్నించింది కానీ సరిగా కనబడలేదు.  తలుపు తీసింది.ఇంకెవరు అక్బరే..

‘నూర్.. నువు బట్టలు సర్దుకుని నాతో వచ్చెయ్. నిన్ను మా అక్క ఇంట్లో వుంచుతాను. తరువాత నువు ఏదైనా జాబ్ చూసుకోవచ్చు నీ ఇష్టంతో స్వేచ్ఛగా బ్రతకొచ్చు. ఇక్కడ ఈ రాక్షసుడితో వుంటే నువ్వు చచ్చిపోతావ్’ హడావిడిగా చెప్పాడు.

రెండ్రోజుల పరిచయంలో అక్బర్ తీసుకునే ఈ చనువును ఎలా రిసీవ్ చేసుకొవాలో అర్థం కాక తికమక పడింది నూర్జహాన్.

కానీ మనసు మాత్రం అతడు మంచివాడేనని చెప్తోంది. ఇక్కడ మనసులేని పశువుతో కలిసి వుండటం కంటే స్వతంత్రంగా బ్రతకడం మేలనిపించింది.

అక్బర్ తో వెళ్ళడానికే నిర్ణయించుకుని ఒకసారి గట్టిగా ఊపిరి పీల్చుకుని సర్దిన బ్యాగును చేతిలోకి తీసుకుని కారెక్కింది.

అక్బర్ వాళ్ళ అక్క ఫాతిమా తన తమ్ముడు అక్బర్ చెప్పిందంతా విని బాధ పడింది. పరిస్థితిని అర్థం చేసుకుని నూర్జహాన్ ను భయపడవద్దని చెప్పి అక్కున చేర్చుకుంది. నూర్జహాన్ భర్త ఫోన్ చేసి 'ఎక్కడున్నావే.. ఎవడితో వెళ్ళావే' అంటూ ఛండాలంగా మాట్లాడాడు.

ఫాతిమా ఫోన్ అందుకుని 'భార్యను కొట్టే వాడివి నువ్వు మగాడివటరా వెధవా. ఈ రోజే నూర్జహాన్ కువైట్ ముల్లాలను కలిసి నువు పెట్టే హింసలను చెప్పి నీకు తలాక్ ఇస్తుంది. నోరు మూసుకుని నీ పని చూసుకో లేకపోతే పోలీసులకు చెప్పి నిన్ను అరెస్ట్ చెయ్యించాల్సి వస్తుంది' అని బెదిరించింది.

ఫాతిమా కువైట్ లో  షేకులతో పరిచయాలు వున్న మనిషి. ఆమెకు అక్కడ మంచి పలుకుబడి వుంది. దెబ్బతో వాడి తిక్క కుదిరింది. కుక్కిన పేనులా నోరు మూసుకుని పది రోజుల్లోనే నూర్జహాన్ కు తలాక్ ఇవ్వక తప్పలేదు.

నూర్జహాన్ అమ్మానాన్నలకు విషయం తెలిసి బాధ పడ్డారు. కూతురు వాడి వేధింపులనుండి విడుదల అయినందుకు సంతోషించారు.

నరకం నుండి బయటపడ్డట్టు భావించింది నూర్. ఫాతిమా కు కువైట్ సిటీ మాలియా లో పెద్ద సూపర్ మార్కెట్ వుంది. నూర్జహాన్ వీసానుమార్పించి అందులో షిఫ్ట్ లీడర్ గా జాబ్ ఇచ్చింది.

అక్బర్ కు అదే వీధిలో మొబైల్ షాప్ వుంది. అందులో పని చెయ్యడానికి మెరికల్లాంటి ముగ్గురు కుర్రాళ్ళు వున్నారు. మాలియా రద్దీగా వుండే ప్రాంతం కాబట్టి బిజినెస్ బావుంటుంది.

కువైట్ లోని సంపాదనతో అహ్మదాబాద్ లో ఇల్లు కొన్నాడు. అక్క ఫాతిమాకయితే  చెప్పాల్సిన పని లేదు. అహ్మదాబాద్ లో నాలుగు ఇల్లులు వున్నాయి. అత్తవారి ఊరైన హైద్రాబాద్ లో పెద్ద షాపింగ్ మాల్ వుంది. ఇరవై ఏళ్ళుగా కువైట్ లో స్థిరపడి దాదాపు యాభై మందిని ఇండియానుండి రప్పించి తన సూపర్ మార్కెట్లో పనిలో పెట్టి ఇండియాలోని పేదవాళ్ళకు సహాయం చేసింది.

ఫాతిమా ఒకరోజు నూర్ అమ్మనాన్నలకు  ఫోన్ చేసి 'మీ అమ్మాయిని మా తమ్ముడు అక్బర్ కు ఇచ్చి నిఖా చెయ్యాలి' అని అడిగింది.

అంతకన్నా సంతోషం ఏముందమ్మా అన్నారు వాళ్ళు. వాళ్ళది నెల్లూరు. ఆ వేసవిలో అందరూ కువైట్ నుండి వచ్చి హైద్రాబాద్ లో అక్బర్, నూర్జహాన్ ల వివాహం జరిపించారు. ఇప్పుడు ఆ దంపతులు కువైట్ లో నలుగురు పిల్లలతో, నాలుగు మొబైల్ షాపులు, నలభైమంది పనివాళ్ళతో  సంతోషంగా జీవిస్తున్నారు.

Post your comments